ఇంత బాధ అనుభవించిన డేవిడ్‌ను టెలివిజన్ ద్వారా ఆ దేశ ప్రజలకు పరిచయం చేశారు. డేవిడ్ తన అద్భుతమైన సందేశాన్ని ప్రజలకు ఈ విధంగా చెప్పాడు.

"నేను వియత్నాంకు వెళ్ళిన తర్వాత నాలో శారీరకంగా మానసికంగా చాలా మార్పులొచ్చాయి. ఒకప్పటికంటే ఇప్పుడు పరిపూర్ణ మైన వ్యక్తినయ్యాను. నా జీవితంలో నాకు ఎదురైన దుర్ఘటన, నాకు కలిగిన వేదన ద్వారా భగవంతుడు నాకో పెద్ద సహాయం చేశాడు. ఈ వేదనవల్లే నేను మనుషులకు దగ్గరయ్యాను. నా జీవితంలోని విషాదంతో పోరాడిన నేను ఇతరులకు స్ఫూర్తి కలిగించే అవకాశాన్ని భగవంతుడు ఈ ఏక్సిడెంట్ ద్వారా నాకు కలిగించాడు"

డేవిడ్ మాటలకు ప్రజలు ఆశ్చర్యపోయారు. అతన్ని చూసి ఎంతగానో స్ఫూర్తి పొందారు. డేవిడ్‌కు వచ్చిన కష్టం తమ పిల్లలకు రాకూడదని ఎవరైనా అనుకుంటారు. అంత విషాదం అతన్ని చుట్టిముట్టినా దేవుడు అతని కష్టన్ని చాలా ఫలవంతంగా, ఎంతో విలువైనదిగా మార్చాడు.

..... అదీ కథ.

అన్నీ సక్రమంగా జరుగుతూ, ఆనందంగా వుండేవాళ్ళకు ఓదార్పు అవసరం వుండదు. ఒక వ్యక్తి నిరాశా నిస్పృహలతో పోరాడేటప్పుడు ఆత్మవిశ్వాసానికి దెబ్బతగిలినప్పుడు, ఆత్మన్యూనతా భావం వేధించేటప్పుడు, అపజయాలు ఎదురైనప్పుడు మాత్రమే ఓదార్పు, ప్రోత్సాహం అవసరం అవుతాయి.

ముఖ్యంగా పిల్లలు శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా తల్లిదండ్రుల మీద ఆధారపడి వుంటారు. కాబట్టి వాళ్ళ దగ్గరనుండి ప్రోత్సాహాన్నీ, ఓదార్పుని కోరుకుంటారు. అందువల్ల మన పిల్లలకి ఏ సమస్య వచ్చినా, వాళ్ళను ఓదార్చి, వాళ్ళ కష్టమే వాళ్ళ మంచి వ్యక్తిత్వానికి పునాది! అనే విషయాన్ని చెబుతూ, వాళ్ళు నిర్మాణాత్మకంగా ఆలోచించేలా చేసే బాధ్యత తలిదండ్రులదే.

ఒకే వీధిలో వుండే ఇద్దరు పిల్లల్లో ఒకరు ఏ.సి కారులో వెళుతుంటే వేరొకరు ఎండలో నడిచి వెళ్తుండవచ్చు. ఎండలో నడిచి వెళ్ళేవాళ్ళను ఎండ అంతగా బాధ పెట్టదు. అదే ఏ.సి. కారులో వెళ్ళేవాడికి ఎండలో నడవడమంటే యాతనగా అనిపిస్తుంది. శరీరమైనా, మనసైనా కష్టానికి అలవాటు పడటం జరిగితే ఆ కష్టం అంతగా బాధించదు. నిజంగా కష్టపడ్డ వ్యక్తికి ఎదుట వ్యక్తి కష్టాన్ని అర్థంచేసుకోగలిగే శక్తి వుంటుంది.

'ఆకలి' అంటే ఏమిటో తెలిసినవాళ్ళకు మరో వ్యక్తి ఆకలి అర్థమవుతుంది. ఏక్సిడెంట్‌లో బాగా దెబ్బలు తగిలిన వ్యక్తి, అదే పరిస్థితి ఇంకొకరికి ఎదురైతే ఆ బాధ అర్థం చేసుకోగలుగుతాడు. ఒక నవల రాసిన రచయితకు మరో వ్యక్తి రచన చేస్తుంటే ఆ కష్టం ఎలాంటిదో అర్థం చేసుకోగలుగుతాడు.

అదే రాయకుండా నలుగురితో నాలుగురాళ్ళు రువ్వేవాళ్ళకు ఆ బాధ, కృషి ఎలా అర్థం అవుతాయి? అందువల్ల ఎవరైతే కష్టపడతారో వాళ్ళకు ఎదుటివాళ్ళ బాధ, దు:ఖం అర్థం అవుతాయి.

కష్టపడటం వల్ల మరో లాభం వుంది. మన అనుభవం అహంకారాన్ని తగ్గిస్తుంది. వినయాన్ని, నమ్రతను పెంచుతుంది. అందువల్ల ఇతరులకు సహాయం చేసే గుణం అలవడుతుంది. మూడు రకాల అంగవైకల్యాలతో బాధపడ్డ హెలెన్ కెల్లర్ తాను పూర్తిగా నిస్సహాయురాలినని దిగులుపడకుండా, తనలాగా అంగవైకల్యంతో బాధపడేవాళ్ళకు సేవచేయడం అనేది మనల్ని మానవత్వం వైపు, సేవాగుణంవైపు, సేవాగుణంవైపు నడిపితే అంతకంటే కావలసినదేముంది?

చిన్నతనంలోనే కష్టపడ్డ వాళ్ళలో మానసికమైన ఎదుగుదల ఎక్కువగా వుంటుంది. బడిలో, కాలేజీలో మనం చదివే అక్షరాలకన్నా అనుభవాలే మనిషిలో జ్ఞానాన్ని కలిగిస్తాయి. మంచినీ, చెడునూ విశ్లేషించగలిగే గుణం, సహనం ఒకరిమీద ఆధారపడకుండా తన స్వశక్తితో బతకడం - ఇవన్నీ కష్టపడడం వల్లే అలవడతాయి.

తినడానికి తిండిలేని ఎందరో యువకులు ఎంతో కష్టపడి పారిశ్రామికవేత్తలు అయితే అందులో ఆశ్చర్యము లేదు. ఇంత అభివృద్ధికి కారణం కేవలం కష్టపడటమే.

కష్టం ఎదురైనప్పుడు మనుషుల్లో ఐకమత్యం పెరుగుతుంది. గోదావరికి వరదలొచ్చినప్పుడు ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో వున్న వారు అన్ని భేదాలు, దెబ్బలాటలు మరచిపోయి ఒకటవుతారు.

జాతులు, కులాలు, ద్వేషాలు తాత్కాలికంగానైనా నశిస్తాయి. ఆపదల్లో ఆత్మీయతలు ఆదరణలు పెరుగుతాయి. పెద్దవాళ్ళమాట వినని పిల్లలు కూడా తమకు దెబ్బతగిలినపుడు, జ్వరం వచ్చినప్పుడో బుద్ధిగా, ప్రేమగా వుంటారు.

మనం ఓ విషయం జ్ఞాపకం వుంచుకోవాలి. పిల్లలు శారీరక, మానసిక సమస్యలతో బాధపడుతుంటే మనం ఎంతో ఓర్పుగా, నేర్పుగా వ్యవహరించవలసి వుంటుంది. సమస్యలవల్ల పిల్లల్లో మానసిక వికాసం తప్పకుండా వస్తుంది.

కానీ, ఆ మార్పు క్షణాల్లో మనకు కనబడాలని మనం అనుకుంటే అది పొరపాటు. ఒక కాయ పండుగా మారేందుకు కొంత వ్యవధి తీసుకున్నట్లే కష్టాలను ఎదుర్కొన్నవారిలో మానసిక పరిపక్వత వచ్చేందుకు కొంత సమయం పడుతుంది. ఆ విషయం మనం మరచిపోకూడదు.

పిల్లలకు ఏ విషయంలోనైనా మనం సలహా ఇవ్వదలచుకుంటే ముందు మనల్ని మనం సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. పిల్లలకు ఆస్థి, అంతస్తు, కార్లు, నగలు ఇవ్వగలిగే తల్లిదండ్రులు ఎందరో వుంటారు. కానీ, వాళ్ళకు మానసిక వికాసాన్ని, మంచి వ్యక్తిత్వాన్ని ఇవ్వగలిగే తల్లిదండ్రులు కొందరే వుంటారు.

పిల్లలు ఏ విషయములోనైనా ఓటమి ఎదుర్కొన్నప్పుడు, ఆ విషయంలో వాళ్ళకు ఓదార్పునిస్తూ ఆ ఓటమిని నిజమైన విజయానికి సోపానమనే విషయాన్ని వాళ్ళకు అర్థమయ్యేలా చెప్పగలగాలి. ఓటమివల్ల కలిగిన పరాజాయాన్ని పట్టుదలగా మాడ్చుకొనే శక్తి మనం పిల్లలకి ఇవ్వాలి.

ఒలింపిక్స్‌లో ఆడేందుకు, మనదేశ ఖ్యాతికోసం నిజంగా తపన పడేవాడు రాత్రి, పగలు కష్టపడి తన ఆటను ప్రాక్టీస్ చేసేవాడిలో నిజాయితీ కనిపిస్తుంది. అలా కాకుండా ప్రభుత్వం ఖర్చుతో విదేశాలు చూడాలని, కాసేపు వార్తల్లో తన పేరు వినబడాలని కోరుకుంటూ ప్రాక్టీస్ చేసేవాడిలో చిత్తశుద్ధి ఏముంటుంది? మనం ఆడినా, ఆడకపోయినా మన డబ్బులు మనకి వస్తాయి అనే ధీమాతో మన ఇండియన్ క్రికెట్ టీం రాణించకుండా వుంది. పాకిస్తాన్ ఆటగాళ్ళలో అలాంటి నిర్లక్ష్యంకన్నా నిజాయితీ ఎక్కువ కనిపిస్తుంది.

ఆటల్లోలాగే జీవితంలో కూడా గెలుపూ, ఓటమీ వుంటాయి. గెలిచినపుడు, అనుకున్నవి అనుకున్నట్లు జరిగినపుడు అందరూ నవ్వుతారు. అదే అపసవ్యంగా జరిగినపుడు నిరాశపడ్డ వాళ్ళే ఎక్కువ. ఇలాంటి భావాలను మనం వుండే పరిసరాలు మరింత ప్రభావితం చేస్తాయి. ఏదైనా పరీక్షలో ఫెయిలయిన పిల్లవాడిని 'నువ్వు నా కడుపున చెడపుట్టావు' అని తిడితే, ఆ పిల్లాడి నిరాశ ఎక్కువై ఆత్మ హత్య చేసుకున్నా ఆశ్చర్యం లేదు.

అదే అర్థం చేసుకొని తల్లిదండ్రులు "నువ్వు తెలివితక్కువ వాడివి కావు. ఈసారి మరింత కష్టపడి రాస్తే, ఇంకా మంచి మార్కులొస్తాయి" అని ప్రోత్సహిస్తే - అతనే ఒక గొప్ప వ్యక్తి అవుతాడు.

పిల్లలని పెంచే విధానాలు - రకాలు :

ఒక మనిషి సహనానికి ఉన్నతస్థాయి పరీక్ష ఏదయినా వుందంటే అది 'పిల్లలను పెంచడం' అనొచ్చు. తల్లీ, తండ్రీ పుత్రోత్సాహంతో పరవశించాక, ఆ మగత నుండి బయటపడ్డాక ఓ పెద్ద ప్రశ్నార్థకం వాళ్ళ మనసు ముంగిట నిలుస్తుంది. అది 'పిల్లలని ఎలా పెంచాలి?' అనే ప్రశ్న.

ఈ ప్రశ్న అందరూ వేసుకోరు. సాధారణంగా పిల్లలు పుట్టడం అనేది ఎంత రొటీన్‌గా జరిగిపోతుందో, వాళ్ళు పెరగడం కూడా అంతే రొటీన్‌గా జరిగిపోతుంది. ఈ విషయంలో ఆవేశాల ప్రాధాన్యత తప్ప, ఆలోచనల ప్రాధాన్యత వుండదు.

ఇంటికి పెద్దగా వున్న తండ్రి తన ఇష్టా-ఇష్టాలకు తగ్గట్టు అందరూ ప్రవర్తించాలని కోరుకుంటారు. తన అభిరుచులు, అలవాట్లు చాలా గొప్పవని అనుకుంటాడు, నమ్ముతాడు. తన రక్షణలో పెరుగుతున్న పిల్లలు తనలాగే ఆలోచించాలని ఆదేశించాడం జరుగుతుంది.

ఇంతవరకూ బాగానే వుంది.

వచ్చే చిక్కల్లా ఆ తండ్రి అభిరుచులూ, అలవాట్లు ఆలోచనలూ ఎలాంటివి? అన్న ప్రశ్న దగ్గరే ఉత్పన్నం అవుతుంది. తండ్రి తాగుబోతై ఆ పంథాలోనే పిల్లలని పెంచాలి అనుకుంటే ఇల్లు నరకమౌతుంది. అలా కాకుండా ఆ తండ్రికి ఉన్నతమైన వ్యక్తిత్వం వుండి, మంచి అలవాట్లు వుంటే ఆ ఇంటి పరిస్థితి మరోలా వుంటుంది.

కేవలం తండ్రి ప్రవర్తన బాగుంటే చాలా! అనకండి. తల్లి ప్రవర్తన, వ్యక్తిత్వం కూడా పిల్లలమీద ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే ఒక ఇంట్లో పిల్లలు సక్రమంగా పెరగాలంటే తల్లిదండ్రులిద్దరూ సమాన బాధ్యత వహించాలి. వాళ్ళు పరస్పరం వ్యతిరేక ధృవాలయితే పిల్లలు చాలా బాధపడతారు.

ప్రతి వ్యక్తి వ్యక్తిత్వానికి, స్వభావానికి బహుముఖాలుంటాయి. మన ప్రవర్తన ఒక్కరితో ఒక్కోవిధంగా వుంటుంది. ఎదుటి వ్యక్తికి తగ్గట్లు మన ప్రవర్తన మారుతుంది. ఒకే వ్యక్తి తనపై అధికారితో ఓలాగ, సాటి ఉద్యోగస్తులతో ఒకలాగ, తన మిత్రులతో ఓ విధంగా, తల్లిదండ్రులతోనూ, భార్యతోనూ మరో విధంగా ప్రవర్తిస్తాడు.

పిల్లల విషయానికి వచ్చేసరికి వేరేగా పొంతన లేకుండా ప్రవర్తించవచ్చు. ఈ విషయం పిల్లలకి అర్థం కాదు. కనుకే అందరితో బాగావుండే తమ తండ్రి, తమ విషయంలోనే కర్కశంగా వున్నాడనుకుంటారు.

ప్రతి ఇంట్లోను తల్లిదండ్రుల వ్యక్తిత్వం పట్ల వారి ప్రవర్తనలవల్ల ఏర్పడే వాతావరణమవే పిల్లల్లోని వ్యక్తిత్వానికి మూలకారణం అవుతుంది. ఇంట్లో వాతావరణంలో భయం, కఠోరత్వం నిండి వుండే పిల్లలు అభద్రతా భావంతో కుంగిపోతారు. కొన్ని యిళ్ళల్లో ఆహ్లాదం, స్నేహపూరితమైన వాతావరణం వుంటుంది. అటువంటి పరిసరాలలో పెరిగే పిల్లలు ధైర్యస్థులుగా, ఆశాజీవులుగా తయారవుతారు.

తల్లిదండ్రుల ప్రవర్తనలోని లోపాలు అంటే ఆ లిస్టులోకి చాలా వస్తాయి. వారు పూర్తిగా కౄరులో, రాక్షసులో కాకపోవచ్చు. కానీ, కొన్ని దురలవాట్లు కూడా యింటి వాతావరణాన్ని పాడుచేస్తాయి. దురలవాట్లంటే కేవలం తాగటం, రేసుల కెళ్ళడం, పేకాడటం మాత్రమే కాదు. బలహీనతలకు ఖచ్చితమైన స్వరూపం అంటూ వుండదు.

అలవాటుకూ, దురలవాటుకూ మధ్య వో సరిహద్దు యెప్పుడూ వుంటుంది. ఆ హద్దు దాటితే మంచి కూడా చెడుగా మారుతుంది. బాలింత రాలికి బ్రాందీ ఇస్తారు. బావుంది కదా అని తాగుబోతులు కాకూడదు కదా. అలాగే ఏదైనా సరే వో అలవాటు మితిమీరితే అది దురలవాటు అవుతుంది.

ప్రతి మనిషి శరీరానికి విటమిన్లు యెంతో అవసరం. అలాగని మోతాదుకు మించి మల్టీ విటమిన్ మాత్రలు మింగితే తెలియని రోగం మనల్ని పట్టి పీడిస్తుంది. ప్రశాంతతను, నిద్రనూ

కలిగించే 'కాంపోజ్' మాత్రలు ఒకటి బదులు ముప్పయి తీసుకుంటే మనిషి మళ్ళీ నిద్రలేవడు. ఏదో సరదాగా పేకాట ఆడుకుంటే ఆనందాన్నీ టైంపాస్‌నీ కలిగిస్తుంది. దాన్నో వ్రతంలా ఆచరించి, ఇంట్లో వస్తువులనూ, ఇంటినీ తాకట్టు పెడితే కొంప మునుగుతుంది. ఇలా యెన్నో విషయాలు వో హద్దుదాటితే చెడుగా పరిణమిస్తాయి.

అబ్బాయి ఎవరైనా అమ్మాయిని చూసి "మీరు చాలా అందంగా వున్నారని, సౌందర్యానికి ప్రతీకనీ, మనుచరిత్రలోని వరూధినికీ మీకూ బాగా పోలికలున్నాయనీ" పొగిడితే, ఏ మాత్రం సెన్స్ వున్న అమ్మాయైనా, 'ఏమిటి కథ?' అని మనసులో అనుకొంటుంది.

'వాగితే వాగేడులే' అని పట్టించుకోకుండా వెళ్ళిపోతుంది. ఆ హద్దు దాటి చెయ్యి పట్టుకోవడం లాంటివి మొదలుపెడితే వార్నింగులూ, చెంపదెబ్బలూ యెదురౌతాయి. ముద్దుగా మాట్లాడుతున్న చిన్నపిల్ల అధికప్రసంగం చేస్తూ పెద్దవాళ్ళ కబుర్లు చెప్పారనుకోండి, మనకు చిరాకువేస్తుంది. ఏ విషయానికైనా వో 'లిమిట్' వుంటుంది.

మనలోని మంచి అలవాట్లే శ్రుతి మించితే బలహీనతలుగా మారిపోతాయి. మీ ఆవిడ ఇంటిని శుభ్రంగా వుంచుతుందని, మీరు చాలా సంతోషిస్తూ వుంటారు. ఆ గుణం మీకు ఎంతగానో నచ్చుతుంది. కానీ, ఆ శుభ్రత అతిగా మారి ఒక వ్యసనంలా ఇరవై నాలుగ్గంటలూ యింటి శుభ్రతకే ప్రాధాన్యతనిస్తే బాగుండదు.

అలాగే పిల్లలను 'అతి' శుభ్రతతో పెంచుతూ ఎప్పుడూ కేకలువేస్తుంటే మీ సంతోషం ఆవిరైపోయి విసుగు, చిరాకు చోటు చేసుకుంటాయి.

మీరు ఏ పనయినా పట్టుదలగా చేస్తారు. వో నిర్ణయం తీసుకుంటే తిరుగుండనంత దృఢమైన వ్యక్తిత్వం అనుకోండి. అది మంచిదే. కానీ ఈ అలవాటు మోతాదు ఎక్కువయితే అది మొండితనం, మంకుపట్టు అవుతుంది.

ఈ విధంగా మంచి లక్షణాలు మితిమీరితే చెడు లక్షణాలుగా మార్తాయి.

పిల్లలని పెంచే పెద్దల మనస్తత్వాలు ఎన్ని రకాలో మనం తెలుసుకుంటే, ఏ రకం వ్యక్తులు పిల్లలతో యెలా వ్యవహరిస్తారో, వీటిలో ఏ విధానం మంచిదో, ఎవరి ప్రవర్తనలో లోపాలున్నాయో, ఎలా సవరించుకోవలో తెలుస్తుంది. ఇన్ని రకాల ప్రవర్తనలలో పెద్దలయిన మనం ఏ వర్గానికి చెందిన వాళ్లమో నిజాయితీగా ప్రశ్నించుకుని, తెలుసుకొని, ఆ లోపాలను సవరించుకుంటేనే సత్ఫలితం వుంటుంది.

అధ్యాయం-2

అంతరంగమథనం

పిల్లల అంతరంగంలో ఏముందో తెలుసుకోవడం చాలా సులభం. కానీ మనం చేసేదల్లా అలా తెలుసుకోవడానికి కావలసిన ప్రయత్నాలు చెయ్యకపోవడమే వాళ్ళని కొంచెం లాలించో,

బుజ్జగించో లేకపోతే వాళ్ళతో సరియైన కమ్యూనికేషన్ ఏర్పరుచుకునో కొంత మాట్లాడగలిగితే వాళ్లు తమ మనసులో భావాలు, పెద్దవాళ్ళకన్నా క్లియర్‌గా నిర్దుష్టంగా చెప్పగలుగుతారు. ఒక్కొసారి వాళ్ళ భావాలు వింటూ వుంటే మనకే ఆశ్చర్యం కలుగుతుంది.

నిశ్చయంగా ఒక జనరేషన్ కన్నా మరొక జనరేషన్‌లో తెలివి తేటలు, ఐక్యూ అర్థం చేసుకునే శక్తి పెరుగుతాయి. నలభై సంవత్సరాల క్రితం పదో తరగతి చదివే కుర్రాడికి లెక్కలంటే కూడికలు, తీసివేతలు, భాగహారాలు, కాలము - దూరము, వడ్డీలు, శాతాలు వగైరా మాత్రమే.

కానీ ఇప్పుడు పదో తరగతి వాళ్ళు ఆల్జీబ్రా, కంప్యూటర్సు, ట్రిగ్నోమెట్రీ, స్టాటిస్టిక్స్, లాగరిథమ్స్ వరకూ కూడా చదవవలసివస్తోంది. ఈ విధమయ్న సంక్లిష్టత మనుషుల్లో పెరిగేకొద్దీ పిల్లలకి, పెద్దలకి 'గ్యాప్' పెరిగిపోతోంది. 'పెద్దలు తమకన్నా తెలివైనవాళ్ళు కాదు' అనే భావం కూడా చిన్న పిల్లలలో బాగా పెరుగుతోంది. అన్నిటికన్నా ముఖ్యంగా 'పెద్దలు తమని అర్థం చేసుకోవడం లేదు' అన్న ఫిర్యాదు కూడా వాళ్ళ నుంచి ఎక్కువవుతుంది. నిజమే, పెద్దవాళ్ళెప్పుడూ పిల్లలని అర్థం చేసుకోరు.

అలా అర్థం చేసుకోవడం తమ గౌరవానికి భంగంగా పెద్దలు ఫీలవుతుంటారు. కొన్ని రోజుల క్రితం నేనొక మిత్రుడి ఇంటికి డిన్నర్‌కి వెళ్ళడం సంభవించింది.